## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాల ఉత్సవాలు

### కేంద్రమంత్రి బండి సంజయ్

**ఎల్.బి.నగర్, జూలై 20 ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా బోనాల ఉత్సవాలు నిలుస్తాయని కేంద్రమంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ముసారంబాగ్ డివిజన్ సాయినగర్ పోచమ్మ దేవాలయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి లతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ ప్రజలకు ఎంతో గొప్ప పండుగ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుభాష్ చందర్ జి , బొక్క మధుసూదన్ రెడ్డి, వంజరి వినోద్ కుమార్, లింగాల హరి గౌడ్, దేవాలయం చైర్మన్ బండి అనిల్ కుమార్ ముదిరాజ్, సభ్యులు అమిత్ కుమార్ ముదిరాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

**ముసారంబాగ్ పోచమ్మ దేవాలయంలో....** ముసారంబాగ్ పోచమ్మ దేవాలయంలో బోనాలు ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. అదేవిధంగా పారిశ్రామికవేత్త గోవుల రాములు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్



# హైదరాబాద్ వార్త



## ఆధ్యాత్మికతతో పరవశించిన భాగ్యనగరం

* భక్తిశ్రద్ధలతో లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాలు * పట్టువస్త్రాలు, బంగారు బోనం సమర్పించిన మంత్రులు
* అమ్మవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు * వెల్లివిరిసిన బోనాల ఉత్సవ సంబరాలు

**హైదరాబాద్, జూలై 20,ప్రభాతవార్త:** ఆషాఢ మాసం బోనాలు.. తెల్లవారు జాము నుంచే డప్పు వాయిద్యాలు.. పోతరాజుల విన్యాసాలు.. శివసత్తుల పూనకాలు పోటెత్తిన భక్త జనం..బోనాల పండుగను చూసేందుకు రెండు కనులు చాలవులే..అన్న చందంగా భాగ్యనగరం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. భాగ్యనగరం భక్తి పారవశ్యంలో తేలియాడింది. ఎటు చూసినా బోనాల పండుగ సంబరాలే దర్శనమిచ్చాయి. ఆదివారం లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఉత్సవాలు వైభవోపేతంగా జరిగాయి. శివసత్తుల పూనకాలు..పోతరాజుల విన్యాసాలతో బోనాల జాతర ఊరేగింపు నేత్రానందంగాసాగింది. లాల్‌దర్వాజా అమ్మవారికి తెల్లవారు జామున 3గంటలకు జల్లి కదువా, 4 గంటలకు బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 5.30 గంటలకు మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా మహాభిషేకాన్ని నిర్వహించి మొదటి బోనం సమర్పించారు. ఉదయం 7 గంల నుంచి ప్రారంభమైన భక్తుల బోనాల సమర్పణ సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగింది. అమ్మవారికి డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క,కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్‌లు పట్టు వస్త్రాలు సమర్పించారు. అలాగే..అంబర్‌పేట మహంకాళి, కార్వాన్ దర్బార్ మైసమ్మ, చిలకలగూడ కట్టమైసమ్మ బోనాలతో పాటు జంట నగరాల్లోని పలు ప్రాంతాల్లో ఆదివారం వీధి వీధినా బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.





అంబారీపై ఊరేగింపు



చార్మినార్‌లో యువతలు





బోనం ఎత్తిన కవిత

## ఖిల్లా మైసమ్మకు పట్టువస్త్రాలు సమర్పించడం అదృష్టం

### మంత్రి సీతక్క

**ఎల్.బి.నగర్, జూలై 20 ప్రభాతవార్త:** 300 సంవత్సరాల క్రితం వెలసిన ఖిలా మైసమ్మకు పట్టువస్త్రాలు అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ పరిధిలోని ఖిల్లా మైసమ్మ అమ్మవారి బోనాల జాతర సందర్భంగా రాష్ట్ర ప్రజా ప్రభుత్వం తరుపున రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సీతక్క అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, టిపిసిసి మెంబర్ దేప భాస్కర్‌రెడ్డి, ఖిల్లా మైసమ్మ దేవాలయం చైర్మన్ సురేంద్రకుమార్ మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పించిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించగా దేవాలయం తరఫున మంత్రి సీతక్కను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో మహిమలున్న ఖిలా మైసమ్మ బోనాలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తోందన్నారు. ప్రజలు సుఖ శాంతులతో పాడి పంటలతో వర్ధిల్లే విధంగా దీవించాలని, ఖిలామైసమ్మతల్లికి మొక్కులు చెల్లించుకు న్నారు. అమ్మ దీవెనలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రజా ప్రభుత్వానికి మరింత శక్తి ప్రసాదించాలని తల్లిని వేడుకున్నారు.బోనాల పండుగను అత్యంత వైభవంగా కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం నిర్వహిస్తున్నారు. బోనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం కోట్ల నిధులను కేటాయించిందని తెలిపారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయా లను కాపాడేలా బోనాల ఉత్సవాలుఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. మహేశ్వరం నియో జకవర్గం ప్రజలపై దేవతల దీవెనలు ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ తీగల అనితరెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్‌నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, ఆర్కేపురం డివిజన్ అధ్యక్షులు పున్న గణేష్‌నేత, బండి మధు, గట్ల రవీందర్, తలాటి రమేష్‌నేత, జగన్, జ్ఞానేశ్వర్, శేఖర్ ముదిరాజ్, శ్రీధర్, పుట్టగల్ల జంగారెడ్డి, శ్రీశైలం సందీప్, సంతోష్, విప్లవరెడ్డి, లక్ష్మి, రేణుక, మాధవి, సుజాత పాల్గొన్నారు.



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకు వస్తున్న మంత్రి సీతక్క, దేప భాస్కర్‌రెడ్డి

## తెలంగాణకు ముఖ్యమైన పండుగ బోనాలు : సబిత

**ఎల్.బి.నగర్, జూలై 20 ప్రభాతవార్త:** బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పటోళ్ల సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆర్కేపురంలోని ఆషాడమాస బోనాల సందర్భంగా ఆదివారం ఎన్టీఆర్‌నగర్‌లో ఏర్పాటుచేసిన బోనాల వేడుకల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జరుపుకునే పండుగలలో బోనాల పండుగ అతిముఖ్యమైనదన్నారు. సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలు, వ్యవహారాలు ,భౌగోళిక పరిస్థితులు, భాష, పండుగలు, జీవన విధానం, ఆహార అలవాట్లపరంగా ప్రత్యేకతను కలిగి ఉన్న నేల తెలంగాణ రాష్ట్రమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత బోనాల పండుగకు కెసిఆర్ ప్రత్యేక నిధులు కేటాయించి అంగరంగ వైభవంగా నిర్వహించే వారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, గొడుగు శ్రీనివాస్, కొంద్ర శ్రీనివాస్,కంచర్ల శేఖర్, వెంకటేష్‌గౌడ్, పెంబర్తి శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'గాంధీ'లో పార్కింగ్ అస్తవ్యస్తం.. ఇబ్బందుల్లో రోగులు

### వాహనాల రాకపోకలకు ఇబ్బందులు.. మెట్రోరైల్ వాహనాల పార్కింగ్ ఇక్కడే

**సికింద్రాబాద్, జూలై 20 ప్రభాతవార్త:** గాంధీ ఆస్పత్రికి అవుట్ పేషెంట్ రోగులుగా వచ్చే వారికి వాహనాల పార్కింగ్ తలనొప్పి వ్యవహారంగా మారింది. ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తున్న వాహనాల వల్ల అత్యవసరంగా వచ్చే వాహనాలకు పార్కింగ్ సమస్య ఏర్పడుతోంది. కొన్నిసార్లు ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియక వాహనదారులు ఆస్పత్రి ప్రాంగణంలో చుట్టూ తిరుగుతున్నారు. సెక్యూరిటీ సిబ్బంది కూడా సహకరించకపోవడంతో వాహనాలు పార్క్ చేయడం సమస్యగా మారింది. గాంధీ ఆస్పత్రి ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా కనీసం చర్యలు తీసుకునే తీరికలేని పరిస్థితి నెలకొంది. గాంధీ ఆస్పత్రికివచ్చే రోగులు, బంధువులు వాహనాల పార్కింగ్ వల్ల సమస్యలను ఎదుర్కొంటున్నారు. కొన్నిసార్లు నడిచి వెళ్లే అవకాశం లేకుండా పోతోందని రోగులు ఆరోపిస్తున్నారు. ఓపీ ఇతర విభాగాలకు వెళ్లడానికి రోగులను తీసుకొని గాంధీ ఆస్పత్రి సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు అడ్డుగా ఉండదంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. అత్యవసర విభాగం వద్ద తప్ప మిగతా దారిలో ద్విచక్ర, కార్లు, ఆటోలు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుండడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. ఇలాంటి పరిస్థితులను నివారించడానికి కనీసం సిబ్బంది ప్రయత్నించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజురోజుకు గాంధీ ఆస్పత్రికి రోగులు, వారి బంధువుల తాకిడి ఎక్కువవుతోంది. ప్రతి రోజుల దాదాపు రెండువేల మంది రోగులు గాంధీ ఆస్పత్రిలో చికిత్సలు పొందడానికి వస్తుంటారు. వారికి ఇష్టానుసారంగా పార్కింగ్ చేసిన వాహనాలను దాటుకొని వెళ్లడం ఇబ్బందికరంగా మారింది.

**రద్దీ సమయంలో పార్కింగ్ సమస్యలు...**

సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి వచ్చే రోగులు ఆస్పత్రిలో వైద్యం పొందలంటే ఇబ్బందికర పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రధాన గేటు నుంచి లోపలికి వెళ్లే దారిలో అస్తవ్యస్థంగా పార్క్‌చేసిన వాహనాల వల్ల ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు రెండువేల మంది రోగులు గాంధీ ఆస్పత్రికి వివిధ అవసరాల నిమిత్తం వస్తుంటారు. దీనికి తోగు అస్పత్రికి చెందిన సిబ్బంది, డాక్టర్‌లు, నర్సులు ఇలా దాదాపు మరో వెయ్యిమందికి పైగా గాంధీ ఆస్పత్రికి వస్తారు.

పేషెంట్‌లలో దాదాపు 15 వందల మంది ద్విచక్ర వాహనాలపైనే వస్తుం టారు. ఆస్పత్రిలో సరైన పార్కింగ్ సదుపాయం లేకుపోవడంతో వాహనదారులు స్థలం దొరికిన చోట ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రోగులకు సమస్యలు తప్పడంలేదు. వాహ నాలను దాటుకొని వైద్య సేవలు పొందడానికి వెళ్లడం ఇబ్బందికరంగా మారుతోంది.

**పార్కింగ్ లేని మెట్రో రైల్వేస్టేషన్...**

గాంధీ ఆస్పత్రి వద్ద గల మెట్రో రైల్వేస్టేషన్‌కు వాహనాల పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో ఇక్కడనిలపాల్సిన వాహనదారులు నేరుగా గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో పార్కింగ్ చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు మెట్రో రైలు కోసం వచ్చిన వాహనదారులు మరోమార్గం లేక గాంధీ ఆస్పత్రిలో పార్క్ చేస్తున్నారు. ప్రతిరోడు దాదాపు ఐదారు వందల వాహనాలు ఇక్కడ పార్క్ చేస్తుండడంతో గాంధీ ఆస్పత్రి ప్రాంగణం ద్విచక్ర, కార్‌ల పార్కింగ్‌తో నిండిపోతోంది. ఆటోలో వచ్చిన రోగులు వైద్య సేవలు పూర్తి అయ్యేవరకు ఆటోలు కూడా అక్కడే ఉండడంతో సమస్య మరింత తీవ్రంగా ఉంటోంది. కార్లు, ఇతర వాహనాలతో ఖాళీ లేకుండా ఉండడంతో రోగులకు ఇబ్బందులు తప్పడంలేదు. చర్యలుతీసుకోవాల్సిన అధికారులు మిన్నకుండిపోవడంతో సమస్యలను పరిష్కరించే పరిస్థితి కనిపించడంలేదని రోగులు ఆరోపిస్తున్నారు.

**పరిష్కారమెలా ?**

గాంధీ ఆస్పత్రిలో వేలాదిగా వాహనాలు నిలుస్తుండడంతో రోగులకు ఇబ్బందికరంగా మారింది. వాహనాల ఇష్టానుసారంగా పార్కింగ్‌ను నివారించడానికి ఒకరిద్దరు మనుషులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. గాంధీ మెడికల్‌కాలేజీకి దాదాపు 5 ఎకరాల ఖాళీ స్థలం ఉంది. పార్కింగ్‌కు కనీసం ఎకరం కేటాయించినా సమస్య పరిష్కారం అవుతుందని రోగులు చెబుతున్నారు.ఎంతో కొంత పార్కింగ్ ఫీజు పెట్టి వాహనాల పార్కింగ్‌ను ఖాళీ స్థలంలోకి మార్చితే సమస్య పరిష్కారం అవుతుందని అంటున్నారు. ఎనిమిది సంవత్సరాల కిందటి వరకు గాంధీ ఆస్పత్రిలో వాహనాలకు పార్కింగ్ ఫీజు వసూల్ చేసేవారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పార్కింగ్ ఫీజును తొలగించడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి బంధువులతో పాటు గాంధీ ఆస్పత్రి మెట్రో రైలుకోసం వచ్చేవారు ఇక్కడే పార్క్ చేస్తున్నారు. అధికారులు పార్కింగ్ సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని కోరుతున్నారు.



## వివాహేతర సంబంధాలు.. కుటుంబాలు చిన్నాభిన్నం..!

- ఆర్థిక సమస్యలు,ఒంటరితనమే ప్రధానకారణాలు
- గత ఏడాదిలో 34 హత్యలు, 14 ఆత్మహత్యలు
- అనాథలుగా మారుతున్న పిల్లలు
- పెద్దదిక్కు లేకపోవడంతో క్షణికావేశంతో..



**హైదరాబాద్, జూలై 20, ప్రభాతవార్త:** నిండు నూరేళ్లు కలిసి ఉండాల్సిన దాంపత్య జీవితాలు మధ్యలోనే ఆవిరవుతున్నాయి. దంపతుల నడుమ అనుమానాలు, ఒకరికొకరు ఇగో, మర్యాద లేదనే కారణాలతో అక్రమసంబంధాలకు కనెక్ట్ అయి నూరేళ్లపంటను కాలరాసుకొని పిల్లలను అనాథలు చేస్తున్నారు. చిన్నపాటి సమస్యలకు సూచనలు, సలహాలు ఇచ్చేవారు లేకపోవడంతో చాలా జీవితాలు అర్ధాంతరంగా ముగిసిపోతున్నాయి. అంతేకాకుండా భార్యభర్తల నడుమ ఆప్యాయతల కరువై వివాహేతర సంబంధాలతో హత్యలు,ఆత్మహత్యలకు దారితీస్తున్నాయి. దీంతో పిల్లలు అనాథలుగా మారుతున్నారు. ఆలోచనల్లో మార్పులు, సినిమాల నేపథ్యంలో బంధాలు కనుమరుగవుతున్నాయి. ఈ క్రమంలో సుమారు పది రోజుల క్రితం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివాహేతరసంబంధం భర్తకు తెలియడంతో భార్య అతన్ని ప్రియుడితో కలిసి దారుణంగా హత్య చేసిన ఘటన సంచలనంగా మారింది.దీంతో పిల్లలు అనాథలయ్యారు. అంతకు ముందు నెలల క్రితం బాలానగర్‌లో మరొక ఘటన చోటు చేసుకుంది.

**ఏడాదిలో 34 హత్యలు..14మంది ఆత్మహత్యలు..**

నగర పోలీస్ కమిషనరేట్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో ఏడాదిలో సుమారు 34 హత్యలు, 14 మంది ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీస్ రికార్డులు చెబుతున్నాయి. ఇవన్నీ వివాహేతర సంబంధాలే ప్రధానకారణమని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఆలుమగల నడుమ దాంపత్యం లేకపోవడం, ఆప్యాయత చూపకపోవడం,పరిచయస్తులతో మాట్లాడడంపై అనుమనాలు ఇలా చిన్నపాటి సమస్యలపై భార్యభర్తల బంధం తెగిపోతుంది. పెద్దదిక్కు ఉండడంతో ఇరువురి నడుమ ప్రేమానురాగాల చిగురించేలా ప్రయత్నించడంతో బంధం బలపడే అవకాశం ఉంటుందని మానసికవైద్య నిపుణులు చెబుతున్నారు. ఉమ్మడి కుటుంబంలో ఇలాంటి సమస్యలే ఉండవని, గత దశాబ్దానర క్రితం నుంచి వివాహమైన రోజుల వ్యవధిలోనే ఉద్యోగాలు, వ్యాపారాలు అని వివిధ నగరాలకు వలసవచ్చి వేరు కాపురం పెట్టడంతోనే అనుమాన రోగం అధికమైందని పోలీసులు చెబుతున్నారు. అయితే ఆర్థిక సమస్యలు, ఉద్యోగాల బిజితో ఒంటరిగా ఉండడంతే వేరే వ్యక్తులతో స్నేహంగా ఉన్న అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. దీంతో గొడువలు పడి అవమానంతో ఇల్లు వదిలి వెళ్లిపోవడం, ఆత్మహత్యలకు పాల్పడడం, కొన్ని ఘటనలో భర్తలను చంపేయడం వంటి కేసులు ఉన్నాయి. అదేవిధంగా కౌన్సిలింగ్ సెంటర్లకు సైతం అధికశాతం తరలివెళ్తున్నారు. సికింద్రాబాద్, బోరబండ, రాజేంద్రనగర్, బంజారాహిల్స్‌తో చాంద్రాయణగుట్ట, షాలిబండతో పాటు ఆయా ప్రాంతాల్లో చోటుచేసుకున్నాయి.

**తల్లిదండ్రులు, అత్తమామలే అండదండలు..**

సంసార జీవితంపై కష్టాలు తెలియకపోవడంతో చిన్నపాటికి ఘర్షణలు తీవ్రస్థాయికిచేరి ఆత్మహత్యల వరకు వెళ్తున్నాయి. అయితే తలిదండ్రులు, అత్తమామల అండదండలతోనే పూర్తిస్థాయి రక్షణ, భరోసా అని పోలీసులు చెబుతున్నారు. వారిరివురి నడుమ ఏదైన సమస్యలు తలెత్తితే చిన్నపాటి భరోసా, అర్ధమయ్యేలా నచ్చచెప్పడంతో బంధం వికసిస్తుందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా భార్యభర్తల నడుమ ప్రేమ తగ్గడం, ఆర్థిక సమస్యలు, ఒంటరితనం, ఇంటికేపరిమితమైనమనే ఆలోచనలు ఇలా వారి వివాహేతర సంబంధాలకు కారణాలవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. డబ్బు ఉంటేనే ఆనందం కాదని తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. నెలకోకసారి తల్లిదండ్రులు రాకపోకలు సాగించడంతోనే బంధం కొనసాగుతుందని సూచిస్తున్నారు.


అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న గోల్కొండ దేవాలయ చైర్మన్

## కొనసాగుతున్న బోనాల ఉత్సవాలు

**మెహిదీపట్నం, జూలై 20, ప్రభాతవార్త :** ఆషాడ మాస బోనాల ఉత్సవాలు అద్యంతం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నాయి. స్థానికంగా కొలువుదీరిన అమ్మవార్లకు భక్తులు పూజలు నిర్వహిస్తూ మొక్కలు చెల్లించుకుంటున్నారు. ఆషాడమాస బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని గోల్కొండ శ్రీజగదాంబికా మహంకాళి అమ్మవారి దేవాలయ చైర్మన్ చంటి బాబు ఆధ్వర్యంలో కమిటీసభ్యులు సింహవాహిని మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించారు. ఈ కార్యక్రమంలో నాగులపల్లి శ్రీకాంత్, మారుతియాదవ్, వెంకటేష్, ఆకుల చంద్రశేఖర్, దుర్గాప్రసాద్, సంతోష్ గౌడ్, ప్రీతం చారి, శశి కుమార్ లో ఉన్నారు.

### మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ


మహంకాళి అమ్మవారికి పట్టు వస్త్రాలను తీసుకెళ్తున్న సాయికుమార్

**మెహిదీపట్నం, జూలై 20, ప్రభాతవార్త:** ఆషాడమాస బోనాల ఉత్సవాల్లో భాగంగా గౌలిగూడలోని మహంకాళి ఆలయ అమ్మవారికి ప్రభుత్వం తరుపున రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. చల్లంగా చూడు తల్లి అంటున్న వేడుకున్నారు. అనంతరం చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

### అమ్మవారికి శరగోపురం, కంఠాభరణం బహూకరణ


శరగోపురం, కంఠంను తీసుకెళ్తున్న యువజన సంఘం సభ్యులు

**మెహిదీపట్నం, జూలై 20, ప్రభాతవార్త :** బోనాల ఉత్సవాలు లంగర్ హౌస్‌లో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. స్థానిక భక్తులు దేవాలయాలకు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నైవేద్యాలు, బోనాలను సమర్పిస్తూ మొక్కలు చెల్లించుకుంటున్నారు. లంగర్ హౌస్ లోని మార్కెట్ లో కొలువుదీరిన శ్రీ బుజ్జి మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీ బుజిలీ మహంకాళి మార్కెట్ యువజన సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి శర గోపురం, కంఠంను బహుకరించారు. కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### తెలంగాణా సంస్కృతికి ప్రతీక బోనాలు : పద్మారావుగౌడ్

**సికింద్రాబాద్, జూలై 20 ప్రభాతవార్త:**


అమ్మవారి దర్శనం చేసుకుంటున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

తెలంగాణా సంస్కృతికి బోనాలు వేడుకలు ప్రతీకలుగా నిలుస్తాయని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. చిలకలగూడలోని కట్ట మైసమ్మదేవాలయంలో ఆదివారం బోనాలు వేడుక ల్లో పద్మారావుగౌడ్ పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఆలయం నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పద్మారావు గౌడ్‌తో పాటు కార్పొరేటర్లు సామల హేమ, శైలజ, బీ.ఆర్.ఎస్. యువ నేత తీగుల్ల రామేశ్వర్ గౌడ్, బీ.ఆర్.ఎస్. నాయకులు పాల్గొన్నారు. ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం బోనాలు సందర్భంగా అధికారులు జరిపిన ఏర్పాట్లను పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. కట్ట మైసమ్మ దేవాలయం వద్ద భక్తులతో పద్మారావు గౌడ్ ముచ్చటించారు. బోనంతో వచ్చిన భక్తులు ఎక్కువ సేపు క్యూ లైన్ లలో నిలవకుండా అధికారులు సహకరించాలని ఆదేశించారు.

### ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**-బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్**

**చిక్కడపల్లి, జూలై 20 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు)బిఎల్‌పి రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం బిఎల్‌పి రాష్ట్ర కార్యాలయంలో దండి వెంకట్ అధ్యక్షత జరిగిన పార్టీ రాష్ట్ర కమిటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది బహుజన శ్రామిక కులాల ప్రజలు ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న అర్హులైన నిరుపేద కుటుంబాలకు పట్టాలు మంజూరు చేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని దండి వెంకట్ డిమాండ్ చేశారు. బిసి, ఎస్సీ ఎస్టీ మత మైనారిటీలు అగ్రకులపేదలైన బహుజన కార్పొరేషన్ లకు జనాభా దామాషా ప్రకారం నిధులు మంజూరు చేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. తెలంగాణ ఇరిగేషన్ ప్రాజెక్టులకు తగిన నిధులు మంజూరు చేయించడంలో రాష్ట్రం ఎన్నికైన 8 మంది పార్లమెంటు సభ్యులు ఉత్సవ విగ్రహాల్లా మిగిలిన పోయారని చెప్పారు. ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించడం లో బీఆర్ఎస్ పార్టీ వైఫల్యం చెందిందని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు నల్లా సూర్యప్రకాష్, ప్రధానకార్యదర్శి ఎస్ సిద్ది రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సబ్బని లత, ఎలిమినేటి శ్రీశైలం, సహాయ కార్యదర్శి వడ్ల సాయికృష్ణ అన్నిజిల్లాలకు చెందిన పార్టీ కన్వీనర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దండి వెంకట్


పూజలు నిర్వహిస్తున్న రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్


పూజలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు

## ఘనంగా బోనాల వేడుకలు

**ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి శ్రీధర్‌బాబు, పలువురు ప్రజాప్రతినిధులు**

**ముషీరాబాద్, జూలై 20, ప్రభాతవార్త:** నగరంలో ప్రసిద్ధిగాంచిన లోయర్ ట్యాంక్‌బండ్ కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారు జామున నుంచే ప్రారంభమైన బోనాల వేడుకలకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు తరలి వచ్చారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు ఎం.ఎన్.శ్రీనివాసరావు తదితర ప్రజా ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ గోల్కొండ గౌతమ్‌కుమార్‌పటేల్, ఈవో సాంబశివ రావు, ప్రధాన అర్చకులు సాత్విక్‌శర్మలు వారికి ఘనంగా స్వాగతం పలికి, అమ్మవారి ప్రసాదాలు అందచేశారు. అదేవిధంగా బందోబస్తులో భాగంగా ఆలయం వద్దకు వచ్చిన సెంట్రల్‌జోన్ డీసీపీ శిల్పవల్లి అమ్మవారిని దర్శించుకున్నారు.


పూజలు నిర్వహిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

## కళాకారులు ఉదారస్వభావులు

**తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి**

**రవీంద్రభారతి, జూలై 20 ప్రభాతవార్త :** సాధారణంగా కళాకారులు ఉదార స్వభావులు, ఉత్సాహ మనస్కులని, తొందరపాటుతో పనులు జరిగిపోవాలన్న ఆశ, ఆశయంకోసం పనిచేసేవాళ్లు అని, గౌరవం పొందడం, గౌరవించడంలోనూ ముందుంటారని రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. కళాకారులు తన దృష్టిలో దైవస్వరూపులు, గురువును దైవంగా గౌరవించని శిష్యులు కళాకారులు కాలేరని స్పష్టం చేశారు. కళాకారులైనా ఉద్యోగులైనా ఆలోచనతో పనిచేయాలికానీ ఆవేశంతో కాదని, మెదడుతో పనిచేద్దాం, దాంతోపాటు మనస్సుతోనూ పనిచేద్దాం లేకుంటే అసూయ ద్వేషం కసి పగ బేధాభిప్రాయాలు రావచ్చని, మనస్సుతోనైతే ప్రేమ సోదరభావం మనవాడే మనిషేననే భావన వస్తుందని, భవిష్యత్తు గొప్పవారవుతారని ఉద్బోధించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కనకదుర్గ నృత్యవిభావరి ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం జరిగిన గురుపూర్ణిమ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి గౌరవఅతిథులు లయన్ కుసుమ భోగరాజు, కథక్ కళాక్షేత్ర డైరెక్టర్, నాట్యగురు డా. అంజుబాబు, ప్రఖ్యాత గాయని వెంపటి శ్రీవల్లి శర్మ, నృత్యవిభావరి డైరెక్టర్, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలు లయన్ నిర్మలా ప్రభాకర్‌తో కలిసి ప్రఖ్యాత నాట్యగురువులు ప్రసన్నరాణి, డా. పి.రమాదేవి, డా.నిర్మల విశ్వేశ్వరరావులను ఘనంగా సత్కరించగా కనకదుర్గ నృత్యవిభావరి శిష్యులు గురుపూజ నిర్వహించి గురువుల శుభాశీస్సులె అందుకున్నారు.


గురుసత్కార గ్రహీతలతో రమణాచారి, భోగరాజు, అంజుబాబు, నిర్మలాప్రభాకర్ తదితర అతిథులు

### ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలి : మాజీ ఎమ్మెల్యే

**నిజాంపేట్, జూలై 20, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నిజాంపేట్ ప్రజలు, నాయకుల ప్రత్యేక ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ఆదివారం శ్రీకనకదుర్గా అమ్మవారి బోనాల పండుగలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనల మధ్య అమ్మవారి ఆశీస్సులు పొందారు. శివశక్తుల శిగాలు, పోతురాజుల నృత్యాలు విక్షించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ ఆషాడ మాస బోనాల పండుగకు నియోజకవర్గంలో అన్ని చోట్ల భారీ ఏర్పాట్లు జరిగాయని కొనియాడారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రజలు భక్తిశ్రద్ధలతో అమ్మవార్లని దర్శించుకుని సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. తెలంగాణ ఆషాడ మాస బోనాల పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, నియోజకవర్గం ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఆగంపాండు ముదిరాజ్, ఏనుగుల శ్రీకాంత్ రెడ్డి, బుచ్చి రెడ్డి, యువకిరణ్‌రెడ్డి, శంకర్‌యాదవ్, కోలన్ మహిపాల్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీకాంత్, రాజశేఖర్, సుధాకర్ 191 అధ్యక్షులు, శ్రీహర్ష, ఉదయ్, మూర్గేష్, భూపాల్ గౌడ్, సుధాకర్ రెడ్డి, పరమేష్, రవీందర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, కిషోర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

### రాజేంద్రనగర్‌లో సామూహిక బోనాల వేడుకలు

**హైదరాబాద్, జూలై 20, ప్రభాతవార్త:** శ్రీవెంకటేశ్వర యువజన సంఘం ఆధ్వర్యంలో సామూహిక బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అదివారం రాజేంద్రనగర్ గ్రామంలో శ్రీఈదమ్మ అమ్మవారు, శ్రీపోచమ్మ అమ్మవార్లకు సామూహికంగా బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలందరూ సుభిక్షంగా, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేముల మల్లేష్, వేముల శ్రీనివాస్, గుంజరాజు, కొమ్మెర రాములు, కొమ్మెర శంకర్, వేముల శేఖర్, కొమర నరసింహ, కొమర గణేష్, గుంజ మధు, మాగాని మహేష్, వేముల బాలకృష్ణ, మగాని శివ, కొమ్మెర సాయి, సతీష్, జగదీష్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

### బోనాల జాతర తెలంగాణ సంస్కృతిలో అంతర్భాగం

**చందానగర్, జూలై 20, ప్రభాతవార్త :** అందరూ కలిసి ఆడుతూ పాడుతూ చేసే ఆ వేడుకే తెలంగాణ బోనాల జాతరకు ప్రత్యేక ఆకర్షణీయమని, దశాబ్దాల చరిత్ర కలిగిన బోనాల జాతర తెలంగాణ సంస్కృతిలో అంతర్భాగమైందని డప్పు యల్లమయ్య అన్నారు. ఆదివారం చందానగర్‌లోని కైలాష్ నగర్ పోచమ్మ ఆలయంలో కాంగ్రెస్ నాయకులు డప్పు యల్లమయ్య ఆధ్వర్యంలో ఘనంగా బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఈ బోనాల జాతరలో శివసత్తుల పునకాలు, పోతురాజుల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. యల్లమయ్య అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం, బోనం సంర్పించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి వివిధ రకాల నైవేద్యాలను సమర్పించారు. భక్తుల బోనాలతో వీధి వాడా ఎటు చూసినా సందడే! ఎటు విన్నా అమ్మవారి నామస్మరణే. బోనాల సందర్భంగా కైలాష్ నగర్ పోచమ్మ ఆలయం పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ కార్యక్రమంలో డప్పు యల్లమయ్య, రాజయ్య, నాగేష్, శ్రీకాంత్, యాదగిరి, వెంకటేష్, రాజు, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ వాగ్గేయకారులు భరతభూమి పవిత్రతకు నిదర్శనం

**తెలంగాణ శాసనసభ తొలిసభాపతి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి**

**రవీంద్రభారతి, జూలై 20 ప్రభాతవార్త :**

అలనాటి కాలంలోనే అన్నమయ్య, త్యాగయ్య. క్షేత్రయ్యలాంటి మహనుభావులైన వాగ్గేయకారులు వేలకువేల కృతులు, సంకీర్తనలు ఒక్క జీవితకాలంలో వ్రాయడం అద్భుతం, అనితరసాధ్యమని, ఇది భరతభూమి యొక్క పవిత్రతకు తార్కాణం నిదర్శమని తెలంగాణ శాసనసభ తొలిసభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి కీర్తించారు. ఈ పవిత్రభూమి ఎక్కడాలేని ఒరవడి పరంపరలకు పుట్టినిల్లు అని శ్లాఘిస్తూ ఈ పరంపరను భవిష్యత్‌తరాలకు అందిద్దామని పిలుపునిచ్చారు. సారంగి మ్యూజికల్ అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సంస్థ అధ్యక్షురాలు కె.సుప్రియా చక్రవర్తి నిర్వహణ, లంక లక్ష్మీనారాయణ సభాధ్యక్షతన జరిగిన గురుపూజా మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ శాసనసభ తొలిసభాపతి ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ఆత్మీయ అతిథులు ఓలేటి పార్వతీశం, కుసుమ భోగరాజు, సురేఖామూర్తి తదితరులతో కలిసి ప్రముఖ గురువులు పారుపల్లి సత్యనారాయణ, మంథా శ్రీనివాస్, అరవపల్లి శ్రీదేవి, వేదాల శశికళస్వామి, ఎస్.టి.పి.లక్ష్మీస్వరూప, కల్మనూర్ శ్రీనివాసాచార్య, జోగావజ్జల ఉత్తేజ్‌కుమార్‌లను ఘనంగా గురుసత్కారం కావించి శుభాకాంక్షలు తెలిపి ఎంతగానో అభినందించి మాట్లాడారు. మంచి మాట మనస్సును రంజింపజేస్తే, ఉపన్యాసం మనస్సును ఆకట్టుకుంటుంది, సంగీతం ఆహ్లాదాన్ని ఇస్తుంది, నృత్యం గొప్ప అనుభూతిని, పాట వినుసొంపుగా మనిషి మనస్సులో తనముద్ర వేస్తాయని, ఈనాటి చిన్నారుల అపురూప సంగీత గాననివేదన వీనులవిందు చేసిందని, వీరిని తీర్చిదిద్దిన గురుదేవులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. సభకుముందు అకాడమీ చిన్నారులచే గాన నివేదన ఆహుతులకు వీనులవిందు చేసింది. చివరిగా మధుసూదనాచారి తదితర అతిథులతో కలిసి చిన్నారులకు జ్ఞాపికలను బహూకరించి శుభాశీస్సులందజేశారు.

### గాంధీనగర్‌లో ఘనంగా బోనాలు

**చిక్కడపల్లి, జూలై 20 ప్రభాతవార్త:**

ఆషాఢ మాసం బోనాల పండుగ సందర్భంగా గాంధీనగర్ డివిజన్ లోని అమ్మవార్ల దేవాలయాలను గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కరుణ కటాక్షం తో డివిజన్ ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు కార్పొరేటర్ వివరించారు.

కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు వి.నవీన్ కుమార్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, ఎం.ఉమేష్, విష్ణు ప్రసాద్, పి.నర్సింగ్ రావు, సత్తి రెడ్డి, శివ కుమార్, సురేష్, లక్ష్మణ్ యాదవ్, నర్సింహ, ఆనంద్ రావు, సాయి కుమార్, అరుణ్ కుమార్, జ్ఞానేశ్వర్, సంతోష్, ఆకుల అభిషేక, ప్రశాంత్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.



## బోనాల వేడుకల్లో కేంద్ర మంత్రి

**ముషీరాబాద్, జూలై 20, ప్రభాతవార్త:** అంబర్‌పేట్ దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో మహంకాళి బోనాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నాలుగు గంటల నుండే అభిషేకాలతో ప్రారంభమయిన ఈ వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ బోనాల వేడుకలలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, టీపీసీసీ అధ్యక్షులు బి.మహేష్ కుమార్‌గౌడ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ బల్మోర్ వెంకట్, బిజేపీ నాయకురాలు మాధవి లత, అనుముల కృష్ణారెడ్డి, గౌతంరావు, కార్పొరేటర్‌లు పద్మావెంకట్‌రెడ్డి, విజయకుమార్ గౌడ్, దుసరి లావణ్య, కన్నె ఉమా రమేష్‌యాదవ్, మాజీ మంత్రి కృష్ణ యాదవ్, మాజీ కార్పొరేటర్‌లు పద్మావతిరెడ్డి, నారాయణ స్వామి, కమిటీ సభ్యులు కే.దుర్గాప్రసాద్‌రెడ్డి, వై.శంకర్‌గౌడ్, రంగంపల్లి రాజు, బింది మల్లికార్జున్‌గౌడ్, గడ్డం శ్రీధర్‌గౌడ్, చంగల సుధాకర్, దొమకొండ కిషోర్ పాల్గొన్నారు.

### నిజాం పోరాట వ్యతిరేక గళం దాశరధి: మురళీమోహన్ రాజు

**చిక్కడపల్లి జూలై 20 ప్రభాతవార్త:** నిజాం వ్యతిరేక పోరాటానికి గళమిచ్చిన దాశరధి కృష్ణమాచార్యులు " నా తెలంగాణ కోటి రతనాల వీణ " అని పలికారని రచయిత, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో దాశరధి కృష్ణమాచార్యులు జయంతి సందర్భంగా కవిసమ్మేళనం, దాశరధి సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. అనంతరం దాశరధి పురస్కార గ్రహీతలు డాక్టర్ ఆమంచ అంజయ్య, డాక్టర్ బలిజేపల్లి నాగరత్నం, ఇప్ప ఉమారాణి, నన్నపురాజు విజయశ్రీ, కాసర్ల సరోజదేవి, డాక్టర్ ఎమ్.ఎస్.కె.షా, మంత్రిప్రగడ మార్కండేయులు, జి.ఎస్.పార్ధసారధి, లయన్ డాక్టర్ మేడిశెట్టి వెంకటేశ్వర్లు, మిద్దే సురేష్, జెర్రిపోతుల రాజు లను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ, సమాజ సేవకులు డాక్టర్ బి.గంగాధర్ రెడ్డి, సినీ దర్శకులు మాగంటి ప్రసాద్ బాబు, నటులు దర్శకుడు రాజనాల సత్య, కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యక్షురాలు డాక్టర్ రాధ కుసుమ, కవులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

### ముగ్ధమనోహరంగా మనీష్ భరతనాట్య ఆరంగేట్రం

**రవీంద్రభారతి, జూలై 20 ప్రభాతవార్త :** చిన్నతనంలోనే సినిమాటిక్, ఫ్రీస్టైల్, వెస్టర్న్‌స్టైల్‌లో శిక్షణపొందిన మనీష్‌కుమార్ నృత్యంపట్ల అత్యంత ఆసక్తి అపరిమితమైన అభిరుచితో కళాస్వస్థానంలో అద్వితీయ భారతీయ శాస్త్రీయనృత్యం భరతనాట్యాన్ని అభ్యసించి ప్రతిష్టాత్మక జాతీయ కళా వేదిక రవీంద్రభారతి ప్రధాన మందిరంలో భరతనాట్య ఆరంగేట్రం ముగ్ధ మనోహరంగా కావించి ప్రతీఒక్కరి ప్రశంసలందుకున్నారు. ఇప్పటికే తన సృజనాత్మకతను చాటుకుంటూ ప్రపంచవ్యాప్తంగా ప్రతిష్టాత్మక వేదికలపై ప్రదర్శనలిచ్చి ప్రశంసలందుకున్న మనీష్‌కుమార్ ఆదివారం ఉదయం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో భరతనాట్య ఆరంగేట్రంను ముందుగా పుష్పాంజలి అంశంతో ప్రారంభించి తదుపరి బ్రోచేవారెవరురా, ఏ మాయలదిర, బాబా శంకర, అఖిలాండేశ్వరి, కళింగ నర్తన తిల్లానా తదితర అంశాలను ప్రదర్శించి చివరిగా మంగళంతో ముగించి విచ్చేసిన అశేష ప్రేక్షకులు, కళాప్రియుల్ని తన్మయుల్ని చేశాడు. పల్లవి మంజులత, బాల రాజులు కొరియోగ్రఫీ, సుధారఘురామన్ గాత్రం, చంద్రకాంత్ మృదంగం, కె.ఉమావెంకటేశ్వర్లు వేణువు, కె.సాయి వయోలిన్‌లతో అద్భుత వాద్య సహకారంతో ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డా. మామిడి హరికృష్ణ, నాట్యగురువులు సంధ్యా రాజు, ప్రమోద్‌కుమార్‌రెడ్డి హాజరై మనీష్‌కుమార్‌ను సత్కరించారు.

## అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలి

**పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్**

**హైదరాబాద్, జూలై 20, ప్రభాతవార్త:** అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం బోనాల వేడుకలను పురస్కరించుకొని అంబర్‌పేట మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల వేడుకలను అంబర్‌పేట నియోజకవర్గంలో అంగరంగ వైభవంగా నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. రాజకీయాలకు అతీతంగా జరుపుకోవడం స్ఫూర్తివంతమైనదన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, బింది మల్లికార్జున్, శ్రీమంత్‌గిరి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


బోనాల వేడుకల్లో పాల్గొన్న పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

## గీత వృత్తిలో ప్రమాద నివారణకు చర్యలు తీసుకోండి

**కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ**

**చిక్కడపల్లి, జూలై 20 ప్రభాతవార్త:** లక్షలాదిమంది ఆధారపడి జీవిస్తున్న కల్లుగీత వృత్తిలో ఉపాధి అవకాశాలు మెరుగుపరిచి వృత్తిలో ప్రమాదాలు నివారించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వృత్తిలో ఉపాధి ప్రమాదాల నివారణ అంశంపై జరిగిన రాష్ట్ర వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లు గీతవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. వీరిని ప్రోత్సహించి ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందన్నారు. బడా పెట్టుబడిదారులు తయారు చేస్తున్న లిక్కరు, థమ్సప్, కోకో కోలా లాంటి శీతల పానీయాల వల్ల కల్లు అమ్మకాలు పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది వ్యాపారులు కల్లు కల్తీ చేస్తున్నారనే నెపంతో కల్లు పైనే దుష్ప్రచారం చేస్తున్నారని దీనిని మానుకోవాలని అన్నారు. ప్రభుత్వం కల్తీ జరగకుండా చర్యలు తీసుకోవాలి కానీ దాని పేరుతో వృత్తినే దెబ్బతీసే చర్యలు చేపట్టడం సబబు కాదన్నారు. వృత్తిలో ప్రమాదానికి గురైన 710 మందికి ఇవ్వాల్సిన రూ.12.96కోట్ల ఎక్స్‌గ్రేషియా ఎందుకు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వృత్తి చేసే వారందరికి వెంటనే కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలని, పెండింగ్ ఎక్స్‌గ్రేషియా డబ్బులు వెంటనే విడుదల చేయాలని, నందనంలోని నీరా, తాటి ఈత ఉత్పత్తుల కేంద్రం ప్రారంభించాలని, నీరా కేఫ్ ని టెండర్ వేసి దాని ద్వారా వచ్చే ఆదాయాన్ని కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలన్నారు. ఆగస్టు 2 నుండి 18 వరకు అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్ర అన్ని జిల్లాలలో నిర్వహిస్తున్నామని గీత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.వెంకట నరసయ్య, ఏలుగురి గోవిందు, బాల్నే వెంకట మల్లయ్య, పామనుగుల్లా అచ్చాలు, కార్యదర్శులు బూడిద గోపి, చౌగోని సీతారాములు, ఎస్ రమేష్ గౌడ్, బండ కింది అరుణ్, మడ్డి అంజిబాబు, వివిధజిల్లాల అధ్యక్షులు మారగోని కృష్ణస్వామి, కప్పల లింగం, కుర్ర ఉప్పలయ్య, రాగీరు కృష్ణయ్య, ఎస్ ఆశన్న గౌడ్, బోయపల్లి సుధాకర్, గైని సాంబయ్య, బుర్ర శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUDICIAL CIVIL JUDGE-CUM-METROPOLITAN MAGISTRATE: RANGA REDDY DISTRICT : AT L.B. NAGAR**
**O.S. NO. 501 OF 2025**
BETWEEN:
**Smt. Nittala Sai Lakshmi and Others ...PLAINTIFFS**
AND
**The Tahsildar, Mandal Revenue Office, Uppal SRO, R.R. District and another ...DEFENDANTS**
To
**All Concern ...Defendant No.2**
**NOTICE**
Please take notice that above name plaintiffs have filed the above O.S. against the defendants for Declaration the Plaintiffs has Legal heir and the same is posted on **28-07-2025** for your appearance, therefore you defendant No.2 is hereby directed to appear before the Hon'ble Court on **28-07-2025 at 10:30 a.m.** either in person or through an advocate, failing which the matter will be decided as per law in your absence.
(BY ORDER OF THE COURT)
**Sd/- T. NAVEEN SINGH**
**Advocate**
PLOT. No.169,
Venkateshwernagar Colony
Moulali, HYDERABAD - 040.
**CELL : 9391121540**



**IN THE COURT OF THE HON'BLE II JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT:: HYDERABAD**
**O.S.No.2818 of 2025**
Between:-
1). Muktha Tina
D/o. Late Muktha Narsing Rao,
2). Muktha Shiva Kumar
S/o. Late Muktha Narsing Rao,
3). Muktha Maruti Kumar
S/o. Late Muktha Narsing Rao,
are residents of H.No.17-2-1165, Rain Bazar, Near Saibaba Temple, Madannapet, Charminar Yakutpura, Hyderabad – 500023.
4). Gajula Reena W/o. Gajula Bhaskar Rao, R/o. H.No.8-2-68/4-5, Karmanghat, Arpitha enclave, Jillalguda. Saroornagar, K.V.Rangareddy- 500079. ...Plaintiffs
and
1). The Tahsildar, Mandal Revenue Office, Charminar, Hyderabad
2). All concerned.
To,
R2). All concerned:
Whereas the above named Plaintiffs have filed the above suit against the Defendants, praying above Hon'ble Court to pass Judgment & Decree in their favour as under:
a. to declare the Plaintiffs as the Legal heirs of late Muktha Vanisree.
b. to pass such other relief/s as this Hon'ble Court may deem fit and proper in the interest of justice.
You the above named Defendant No.2 take notice that, the above case is posted on **7-8-2025** at 10.30 AM for your appearance and written statement if any, and if you failed to appear before the above Hon'ble Court either in person or through advocate, the matter will be decided in your absence.
**//BY THE ORDER OF THE COURT//**
**Counsel for the Plaintiff**
**KAMTALA SREENIVAS, & K.Saikrishna Advocates,**
**H.no.11-6-141, Saroor Nagar, Hyderabad-500035, Cell No. 9440129813**

